# హైదరాబాద్‌లోనూ జేఈఈ మెయిన్స్

- ఏప్రిల్ 6న ఆఫ్‌లైన్ పరీక్ష
- 8 నుంచి 20వ వరకు ఆన్‌లైన్‌లో
- నార్మలైజ్డ్ పర్సంటైల్ విధానం యథాతథం
- కేంద్రమానవవనరుల శాఖ అధికార వర్గాల వెల్లడి

ఈనాడు - హైదరాబాద్

జేఈఈ మెయిన్స్ రాసేందుకు విద్యార్థులు ఇక మీదట హైదరాబాద్ నుంచి వరంగల్, గుంటూరు నగరాలకు వెళ్లాల్సిన అవసరం లేదు. కిందటేడు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఎదుర్కొన్న ఇబ్బందులను గమనించిన కేంద్ర మానవ వనరుల శాఖ.. ఇకపై హైదరాబాద్‌లోనూ మెయిన్స్ పరీక్ష ఆఫ్‌లైన్‌లో నిర్వహించాలని సూచనప్రాయంగా నిర్ణయించింది. ఈ విషయాన్ని కేంద్ర మానవవనరుల శాఖ అధికారవర్గాలు సోమవారం ధ్రువీకరించాయి. జేఈఈ మెయిన్స్ నిర్వహణ గురించి కేంద్ర మానవవనరుల మంత్రి పల్లంరాజుకు 'ఈనాడు' ప్రతినిధి పంపిన ప్రశ్నలపై.. మంత్రి ఆదేశాలను అనుసరించి అధికార యంత్రాంగం జవాబులిచ్చింది. వచ్చే ఏడాది నుంచి హైదరాబాద్‌లో ఆన్‌లైన్‌తోపాటు ఆఫ్‌లైన్ (పెన్నుతో పరీక్ష రాయడం) కేంద్రాలను కూడా ఏర్పాటు చేస్తామని సూచనప్రాయంగా తెలిపింది. ఇదే విధానాన్ని చండీగఢ్, ఢిల్లీ, జైపూర్, అహ్మదాబాద్, భోపాల్, నాగపూర్, ముంబయి, ఎర్నాకుళం, బెంగళూరు, చెన్నై, భువనేశ్వర్, కోల్‌కతా, అలహాబాద్, లక్నో నగరాల్లో అమలు చేయనున్నారు. ఆన్‌లైన్ విధానాన్ని ప్రోత్సహించే ఉద్దేశంతో కేంద్రప్రభుత్వం గత ఏడాది.. మహానగరాల్లో 'ఆన్‌లైన్' పరీక్షకు మాత్రమే అవకాశం కల్పించింది. దీంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఎదుర్కొన్న వ్యయప్రయాసలు అన్నీఇన్నీ కావు. ఆఫ్‌లైన్ పరీక్ష కేంద్రాలు ఉన్న ఇతర నగరాలకు వేల సంఖ్యలో విద్యార్థులు తరలి వెళ్లారు. అక్కడ వారికి బస, భోజనం వంటి సమస్యలు ఎదురయ్యాయి. కేంద్ర మానవ వనరులశాఖ తీరుపై



తీవ్రస్థాయిలో విమర్శలు చెలరేగాయి. ఈ నేపథ్యంలో.. హైదరాబాద్‌తోపాటు పలు ఇతర నగరాల్లో ఆఫ్‌లైన్ విధానంలో పరీక్ష రాసే అవకాశం కల్పించాలని కేంద్రం నిర్ణయించింది. మరోవైపు, గత ఏడాది రాష్ట్రంలో ఏర్పాటైన ఆఫ్‌లైన్ పరీక్ష కేంద్రాలు ఈసారి కూడా కొనసాగే అవకాశం ఉంది.

- జేఈఈ మెయిన్స్ పరీక్షను వచ్చే ఏడాది ఏప్రిల్ 6న దేశవ్యాప్తంగా నిర్వహించనున్నారు. ఆన్‌లైన్‌లో 8 నుంచి 20వ తేదీ వరకు జరపనున్నారు.
- జేఈఈ అడ్వాన్స్డ్ పరీక్షను 2014 మే 25న నిర్వహిస్తారు.
- జేఈఈ మెయిన్స్ పరీక్షను ఏప్రిల్‌తోపాటు ఫిబ్రవరిలోనూ నిర్వహించాలని వచ్చిన ప్రతిపాదనలను జాయింట్ అడ్మిషన్ బోర్డు తిరస్కరించింది.
- జేఈఈ అడ్వాన్స్డ్ పరీక్షను పూర్తిగా ఆఫ్‌లైన్‌లో మాత్రమే నిర్వహించనున్నారు.
- కిందటేడాది మాదిరిగానే ఈసారి కూడా జేఈఈ మెయిన్స్ ఎగ్జామ్‌లో నార్మలైజ్డ్ పర్సంటైల్ విధానాన్ని అమలుచేస్తారు. ఈ విధానంలో ఎటువంటి లోపాలు లేవని, సాంకేతికపరమైన అంశాలపై అవగాహన లేకపోవటం వల్లే అపోహలు వచ్చాయని మానవవనరుల శాఖ తెలిపింది.
- ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు జేఈఈ మెయిన్స్, అడ్వాన్స్డ్ పరీక్షలను రాస్తారు. జేఈఈ మెయిన్స్‌ను ఎన్ఐటీ, ఇతర డీమ్డ్ వర్సిటీలు, జేఈఈ అడ్వాన్స్డ్‌ను ఐఐటీల్లో ప్రవేశాలకు నిర్వహించనున్నారు.